

# ఏకోన్ముఖులు

కె.రామలక్ష్మి

కృష్ణమూర్తి ఆనందంతోనూ, బాధతోనూ పార్వతికేసి చూశాడు. ఆనందానికి కారణం అతడామెను ప్రేమిస్తున్నాడు. దుఃఖానికి కారణం ఆమె స్నేహితురాలుగాని ప్రేయసికాదు! జనవరిలో కలుసుకున్నారు. అప్పుడే ఆగస్టు సెప్టెంబరులు దాటేశాయి. అక్టోబరుకూడా గడిచిపోతూంది. ఈనెలాఖరుకి పార్వతి వూరికి వెళ్ళిపోతుంది! ఇక పార్వతి కనబడదు!

"పార్వతీ నామాట విను" అన్నాడు.

"వింటూనే వున్నాను" అంది పార్వతి.

ఇద్దరూ పార్వతి యింట్లో ముందు గదిలో కూర్చుని ఏకాంతం అనుభవిస్తున్నారు. చదువుతూన్న నవల క్రిందపెట్టలేదు. సరికదా పేజీ తిరగేసింది పార్వతి.

"పార్వతీ! యీ ఆదివారం మహాబలిపురం వెడదామా?"

"ఏమీ చెప్పలేను. అయినా యెంతౌతుందో?"

"ఓ పదిహేను రూపాయలుంటే చాలు. ఇంకో యిద్దర్ని పోగుచేస్తాను - కారున్నవాళ్ళని...."

"అంతఖర్చు భరించలేననుకో! అయినా ఫరవాలేదులే - నాకూ మార్పు కావాలనే వుంది. ఇంట్లో కూర్చుని ఎన్ని చొప్పదంటు నవలలు చదివినా విశ్రాంతిలేదు!" అంది పార్వతి.

"అద్భుతంగావుంది!" అన్నాడు కృష్ణమూర్తి. ఒప్పుకోవడమే తనకి గెలుపని భావించాడు కృష్ణమూర్తి! మళ్ళీ మనస్సు మార్చుకుంటుందేమో అనితక్షణంచెప్పాడు. "ఆ యిద్దరూ బొత్తిగా పైవాళ్ళు కాదులే. సరళ నాకు వరసకి చెల్లెలు అవుతుంది. సరళ మొగుడు పెద్ద ఉద్యోగి. మర్యాదస్థుడు. మనంనలుగురం సరదాగావెడదాం" అన్నాడు.

లేచి నిలబడి పుస్తకం మూసి పక్కన పెట్టింది పార్వతి. సన్నగా నాజూకుగా వుంది. బలమైన చిన్నగెడ్డం, విశాలమైన పెద్దకళ్ళు. నల్లనిజుట్టు నడుందాకా సాఫుగా వేళ్ళాడుతోంది. పాతికేళ్ళ పడుచుదనం వెల్లివిరిసిన యువతి పార్వతి.

"నీ ముక్కుమీద మసి అంటుకుంది" అంటూ దగ్గరకు జరిగాడు కృష్ణమూర్తి. పార్వతి కదల్లేదు. జేబులోంచి మడత నలగని జేబురుమాలుతీసి అతిశ్రద్ధగా తుడిచాడు పార్వతి ముక్కున అంటిన మసి. పార్వతి చూస్తూ నిలబడింది. అక్కర్లేనంత ఎక్కువ సైపు పట్టింది కృష్ణమూర్తికి. సూపైన ఆముక్కు దానిచివర ఓచిన్న పుట్టుమచ్చ! మనెలా వచ్చింది? ఎప్పుడూ ఇంతదగ్గిరగా యిద్దరూ నిలబడలేదు. ఈ సాన్నిహిత్యం కృష్ణమూర్తి హృదయాన్ని కోస్తూంది. ఆ చెంపవాటు నిమిరాలనిపించింది. అలాగే దగ్గిరకి తీసుకుని ముద్దుపెట్టుకోవాలనిపించింది.

కాని పార్వతి రెండడుగులు వెనక్కి వేసింది. వంగి పక్కన పెట్టేసిన పుస్తకం తీసింది. ప్రాణం వుసూరుమంది కృష్ణమూర్తికి. "నువ్వు చేసేపనేమిటో నా కర్థం కావడంలేదు" అన్నాడు. "తెలియకేం? తెలిసే అంటున్నావు" అంది. చిలిపిగా చూస్తూ పార్వతి. "పుస్తకాలంటే అలా

భయపడిపోవడం బాగులేదు. ఎంత ఇంజినీరువైతేమటుకు లోకం ఏమంటోందో తెలుసుకోకపోతే ఎలా?" అంది. కృష్ణమూర్తికి అర్థం అయేపుస్తకాలు తక్కువ. తల్లిచేతిలో తెగనలిగిన అధ్యాత్మరామాయణం, చలం మైదానం, విశ్వనాథ వేయిపడగలో చదివితే చాలు సాహిత్యపు రుచి తెలిసిపోతుందని నమ్మినవాడు కృష్ణమూర్తి. ఇంజనీరుగా తర్ఫీదు ప్రారంభించాక యిలాంటి వాటి జోలికిపోవడం మానేశాడు.

"సరళా, సరళభర్త చాలా సరదాగా వుంటారు. రెండురోజులు వాళ్ళతో కలిసి వున్నావంటే నువ్వూ యిక వెళ్ళిపోవాలని అనుకోవు. అయినా యిప్పుడు ఆ పల్లెటూరు వెళ్ళకపోతేనేం?" అడిగాడు కృష్ణమూర్తి. తనని ఒదుల్చుకుందుకు వెళ్ళిపోతానంటోందేమో అని భయం కృష్ణమూర్తికి. పార్వతి ముఖం అసలుసంగతి వివరించడమేలేదు!

కబుర్లు చెప్పుకుంటూ వీధిలోకి వచ్చేశారు యిద్దరూ. ఈ గబ్బువరండా దాటితే వీధిగేటు. వరండా పొడుగునా యిళ్ళ గుమ్మాలే! అద్దెలకోసం అన్నిసదుపాయాలతోనూ కట్టిన ఇళ్ళవి. ఓ వాటాలో కృష్ణమూర్తివుంటున్నాడు. హఠాత్తుగా ఓవాటాలో ఓరోజు ప్రత్యక్షం అయింది పార్వతి.

ఆరోజు ఇద్దరికీ బాగా జ్ఞాపకమే! నిజానికి ఆరోజు ఎవరూ మరువలేదు—

ఏడెనిమిది మాసాలు అయివుంటుంది. ఎర్రని వానకోటు తొడుక్కుని వుంది. తల మీద ఏమీ కప్పుకోకపోవడంతో జుట్టు తడిసి బుజాలక్రిందుగా గమ్మత్తుగా వేలాడుతోంది. ఈ దృశ్యం చూడగానే ఒక్క అడుగు ముందుకు వేయకుండా నిలబడిపోయాడు కృష్ణమూర్తి. ఆమెలోని ఏదో శక్తి అతన్ని కదలనియ్యలేదు. ఈవిపరీతం ఏకోన్ముఖంగా జరగలేదని తెలుసుకుని సంతోషించాడు. పార్వతికూడా అలాగే నిలబడి పోయింది. రెప్పవాల్చకుండా అతణ్ణే చూస్తోంది. ఏదో ఒకటి అనాలని అనుకున్నాడు. కాని ఏమాటా దొరకటంలేదు. పార్వతీ రెండడుగులు వేసి ముందుకు వచ్చింది. చూపుమటుకు తిప్పుకోలేదు—"ఇంతటి విపరీతం నే నెక్కడా చూళ్ళేదు: నమ్మండి" అంది ఏమాత్రం ఉపోద్ఘాతం లేకుండా. సున్నగా గీసివున్న తనగెడ్డం తడుముకున్నాడు కృష్ణమూర్తి.

"గెడ్డం పెంచితే నయమేమో!" అనుకున్నాడు సగం స్వగతంగా.

"అబ్బెబ్బె! అదేంకాదండీ. నాకళ్ళని నేనే నమ్మలేకుండా వున్నాను. ఆ కనుబొమ్మలమధ్య.చిన్నగుంటలదగ్గిరనుంచి.... ఏం తేడాలేదు. మీ రాగిజుట్టు! మీముక్కు తీరు! నాతోరండి చూపిస్తాను." అంటూ అడుగులు త్వరగా వేసింది పార్వతి. ఆమె అన్నమాటలో ఒక్కటికూడా బోధపడలేదు. కాని రమ్మందని మటుకు వినిపించింది. అంతే నిద్రలో నడిచే వ్యక్తిలా ఆమెవెంట నడిచాడా రోజు.

"ఈవేళేవచ్చాను. ఇంకాసామానుకూడా పూర్తిగా సర్దుకోలేదు. ప్లీజ్ కూర్చోండి!" అంటూ ఓపెట్టెముందు మోకాళ్ళ మీద కూర్చుని వెతకడం ప్రారంభించింది.... దాట్లో ముందో అని ఆత్రంగా, కూర్చున్న పార్వతి తలమీంచి తొంగి చూశాడు కృష్ణమూర్తి. అన్నీ పుస్తకాలే!! ఈవిడో పుస్తకాల పురుగుకాబోలు అనుకుని గప్‌చిప్‌గా కూర్చున్నాడు. ఆ పుస్తకాలలో వెతికి తనకి కావలసినది పట్టింది. దాంట్లో వెతికి తనకి కావలసిన పేజీ తీసి 'ఇదిగో!' అంటూ పట్టుకొచ్చింది. అదొకబొమ్మ. సరిగ్గా తనలాగే వున్న బొమ్మని చూస్తున్నాడు! అది అద్దంకాదు కదా అనిపించింది కృష్ణమూర్తికి. పార్వతి సన్నగా నవ్వింది.

"చూశారా? అదో ప్రముఖ చిత్రకారుడు పదహారో శతాబ్దంలో చిత్రించాడు. దాన్ని చూస్తుంటే పునర్జన్మలో నమ్మకం కల్గడంలేదూ! మళ్ళీ యీ అవతారంలో పుట్టారు మీరు?" అంది. "నాకిదో పిచ్చి అనుకోకండి. నాపేరు పార్వతి. ఇల్లు దొరక్క అవస్థపడుతున్నాను. మా అత్తయ్య ఖాళీ చేస్తూ యీయిల్లు యిప్పించింది....నేను వృత్తిద్వారా గుమాస్తాని. కాని సాహిత్యం నా వూపిరి. కళచూపు." అనిపరిచయంచేసుకుంది....ఎందుకో అర్థం లేకుండానే యిద్దరూ నవ్వుకున్నారు....కాఫీతాగుతూ ఆరోజువర్షం తగ్గకూడదని కోరుకున్నాడు కృష్ణమూర్తి!

ఓ గంట రెండుగంటలు - ఎంతసేపు కూర్చుంటాడు! వెళ్ళక తప్పదని వెళ్ళిపోయాడు. ఆరాత్రి సగం గడిచేవరకూ పార్వతిని తలుచుకుంటూనూ, మిగిలినది ఆమెనుగురించి కలలు కంటూనూగడిపాడు.

పార్వతి చాలా నిర్మొగమాటి అని గ్రహించాడు కృష్ణమూర్తి. దారిలో కలిసి వెడుతూ కాఫీ తాగుదాం వస్తారా అండీ, నాడబ్బు నన్ను పెట్టుకోనిస్తారా? అని అడిగేది! అయినా కృష్ణమూర్తి లెక్క చెయ్యలేదు. అంతులేని ఆకర్షణలోపడిపోయాడా ఘోటక బ్రహ్మచారి. ఏడు మాసాలూ ఎలాగో గడిచిపోయాయి. అడపా తడపా మాట్లాడుకోవడం మానేసినా, యిద్దరూ కలిసి పుస్తకాల షాపులో, పేవ్‌మెంట్లూ కలిసి తిరిగారు. పార్వతి కోసం అని మంచిబొమ్మలు చూడ్డం, మంచి పుస్తకాలు చదవాలనుకోవడం మొదలు పెట్టాడు కృష్ణమూర్తి. ధైర్యం కూడకట్టుకుంటున్నాడు – ఓరోజు అడగాలని, ఆమె తల్లితండ్రులను గురించి, ఇతర వివరాలను గురించి తెలుసుకోవాలని, ఇంతసున్నితంగా వుండే ఆడపిల్ల హారర్ సినిమాలు తప్పించి చూడదేం అని. ఎంతకోపంగావున్నా 'హిచ్‌కాక్ వచ్చాడంటే' సుముఖురాలవుతుందేమని.

ఉన్నట్టుండి ఉరమని పిడుగులా ఆ రోజుసాయంత్రం చెప్పింది వూరికి వెడుతున్నానని. వెళ్ళి తీరాలా! అని ఎన్నో రకాలుగా ప్రశ్నించాడు. ముక్కుమీద లేని మసిని ఎంతో నేర్పుతో తుడిచాడు. అయినా పార్వతి మారదు. అందుకే సరళతో కలిసి శనివారాదివారాలుగడుపుతే....దారిలోకివస్తుందేమో అని వేశాడు ప్లాను. ఏ కళనుందో ఒప్పుకుంది పార్వతి.

ఇలాగే రెండునెల్లక్రితం ఓ శుక్రవారం రాత్రి వానవచ్చేలా వుంటే గుప్‌చిప్‌గా యింట్లో కూర్చున్నాడు కృష్ణమూర్తి. పార్వతి తొలిరోజున యిచ్చిన ఓపుస్తకం చదవాలని ప్రయత్నిస్తున్నాడు. గడియారంలో తొమ్మిది అవుతూంది. వస్తూన్న నిద్రని ఆపుకొంటూ, ఆలోచనల మిణుగురు పురుగులని చెదరకొడుతూ పుస్తకం చదవాలని చూశాడు. ఇంతల్లోనే యెవరో తలుపుతట్టినట్టయింది. పార్వతి. ఇంతరాత్రి

వేళ యెందుకొచ్చిందా అనిపించి, వచ్చిందంతేచాలు అనిపించింది కృష్ణమూర్తికి. లైటువెలుగులో - ఆ విశాలమైన కళ్ళక్రింద నీడలు పరచుకున్నాయి. ముఖంమీది చిరునవ్వు కూడా అమర్చుకున్నట్టేవుంది. 'రా పార్వతీ వచ్చి కూర్చో' అంటూ దారికడ్డులేచాడు. వచ్చి కూర్చునీ కూర్చోనట్టు కుర్చీ చేతిమీద కూర్చుంది....ఏ క్షణాన్నైనా ఎగిరిపోయే పిట్టలాగా. "కూర్చోను చాలాసేపు. ఇక్కడే దగ్గర హాల్లో-'మూన్‌స్టర్సు ఫ్రెమ్ అవుటర్ స్పేస్' ఆడుతూంది. నాకు సాయం వస్తావా?" ఎంత బుద్ధిగా అడిగింది! అంతరిక్షపు భయంకర రాక్షసులు అమాంతం మానవ మాత్రులని నమిలి మింగేస్తూంటే ఆనందిస్తూ సంతోషంతో మెరుస్తాయా ఆ మాయకం అయిన కళ్ళు! అనుకున్నాడు. "అంతకంటేనా!" అంటూ యిట్టే తెమిలి, తలుపుతాళంపెట్టి బయలుదేరాడు కృష్ణమూర్తి. పార్వతిఅలావచ్చి అడగడం ఆశ్చర్యంగానే వుంది కృష్ణమూర్తికి. కాని ఆ అడగడంలో ఏదో అసహజమైనది. బాధతో సహాయం అర్థించడం లాంటిది కన్పించింది కృష్ణమూర్తికి.

ఇద్దరి టిక్కెట్లకీ డబ్బు తనేయిచ్చింది. సినిమా చూస్తున్నంతసేపూ తల యిటూ అటూ కదపనైనా లేదు పార్వతి. కాని ఆ చీకట్లో కళ్ళల్లో వెల్గునింపుకొని ఆమెనే చూస్తున్నాడు కృష్ణమూర్తి. ఏమిటీ పార్వతి అని వెయ్యిసార్లయినా తలబద్దలు కొట్టుకున్నాడు.

సినిమాహాల్లోంచి బయటికి వచ్చేసరికి అర్ధరాత్రి దాటింది. పార్వతి మూడ్ కొంచెం మారినట్టేవుంది. సన్నగా తనలోతానే నవ్వుకుంటూ అంది "నా కిలాంటి సినిమాలంటే సరదా. మనస్సు బాగోలేనప్పుడు, అనుకున్నవి అనుకున్నట్టు జరక్కుండా దారి తప్పినప్పు డిలాంటి సినిమాచూస్తే నాకెంతో తెరిపిన పడ్డట్టు వుంటుంది! నిజ జీవితంలో వాటిని గురించి కంటె యీ భూతాలనీ పిశాచాలనీ క్రూరమృగాలని గురించి హైరానపడ్డం రిలీఫ్ కదూ?" అంది.

"మనం స్నేహితులమేనా పార్వతీ?" నిలదీసి అడిగాడు కృష్ణమూర్తి. నవ్వుతూ "ఏం అంత సందేహం వచ్చింది?" అంది.

"అయితే దీనికి సమాధానం చెప్పు. నువ్వెందుకు యెప్పుడూ సరదాగా వుండవు? పెళ్ళంటే దడుసుకున్నట్టలా తప్పించుకు తిరుగుతావేం? చెప్పు పార్వతీ" ఆప్యాయంగా ఆమె చెయి అందిపుచ్చుకున్నాడు.

అతని చేతిలోవున్న తన చేతినే చూసుకుంటోంది పార్వతి. "ఒకసారి పెళ్ళి చేసుకున్నంతదాకా వచ్చాను. నాన్నగారు రెండు సంవత్సరాలాగి పెళ్ళి చేస్తామన్నారు. కాని ఏడాదిలోగానే అంతా అయిపోయింది. అతనంటే భరించలేని స్థితికి వచ్చేశాను. ఈరోజేమైందో తెలుసా? అతను పెళ్ళి చేసుకున్నాడని వార్త వచ్చింది. అదెందుకు నన్నింత బాధ పెట్టాలి అని నాకు పౌరుషం వచ్చింది ...." వినీవినబడకుండా చెప్తూంది పార్వతి. "క్షమించు యింత గొడవ వుందనుకోలేదు." అంటూ ఆప్యాయంగా తన చేతిలోవున్న ఆమెచేయి నొక్కాడు. ఓసారతని ముఖంలోకిచూసి తలదించేసుకుంది పార్వతి.








ఆరోజే ప్రారంభం అయింది .... కృష్ణమూర్తిపీడకల. రోజుకిరోజు పార్వతికి సన్నిహితం అయిపోతున్నాడు. పుస్తకాలకొట్టు, సినిమాలు, బీచ్. పార్వతిలేని తన జీవితం మరిచిపోయాడు కృష్ణమూర్తి. ఆ రోజున అంది వూరికి వెళ్ళిపోతున్నానని, ఆరోజే - సరళని కలుసుకుంటే బాగుంటుందని ప్లాను వేశాడు కృష్ణమూర్తి. అందుకే అందరూ కలిసి మహాబలిపురం ప్రయాణం కట్టారు. సరళ ఏలాగైనా పార్వతిని కదిల్చి తనని పెళ్ళి చేసుకునేందుకు ఒప్పిస్తుందని కృష్ణమూర్తి ధైర్యం....

వీధిలో ఇద్దరూ ఎవరిదారినవారు నడుస్తూ 'మరిచిపోను' అంటే 'మరిచిపోను' అనుకున్నారు.

సూర్యోదయం మహాబలిపురంలో చూడాలని నిశ్చయించుకుని దాగా చీకటిగా వుండగానే బయలుదేరారు. తొలి పరిచయాలు కారు కదలగానే చేశాడు కృష్ణమూర్తి. మొదట్లో కొంచెం ముభావంగావున్నా చాలా కలుపుగోలుగా మాట్లాడ్డం ప్రారంభించింది పార్వతి.

'రాతిరథాలూ రాతిఏనుగూ ఎంతసేపని చూస్తాం? అలా బీచిలో కూర్చుందాం' అంది సరళ. కాని పార్వతి తీవ్రంగా చూస్తూంది. సరళభర్తకూడ చాలా కుతూహలంగా చూస్తున్నాడు. ఒకళ్ళకొకళ్ళు చెప్పుకుంటూ వాళ్ళిద్దరూ అలా అలా అన్ని శిధిలాలనా చూస్తూ మిగిలినవాళ్ళ వునికి మరిచిపోయారు, మధ్యాహ్నం భోజనం సమయానికంతా వాతావరణంలో స్తబ్ధత ఆవరించింది. సరళ ఒక్కమాట మాట్లాడ్డంలేదు. కృష్ణమూర్తికేం మాట్లాడాలో తెలియటం లేదు. పార్వతీ సరళ భర్తా మటుకు ప్రపంచరాజకీ




యాలనుంచి, పల్లాకిమిడి పారిశుధ్యందాకా చర్చిస్తున్నారు. జోక్సు వేస్తున్నారు. నవ్వుతున్నారు. కృష్ణమూర్తి మధ్యలో పార్వతిని పిలిచినా వినిపించుకోనట్టు వూరుకుంటూంది...."మీయిద్దరే అంతఆనందంగా వుండగల్గితే నేనెందుకు మధ్య?" అంటూ వెళ్ళి కార్లో కూర్చుని నెత్తిమీద కుండ వంపింది సరళ. ఎదురుచూడని యీ పరిణామానికి అదిరిపడి కారుదగ్గిరకి పరుగెత్తాడు సరళభర్త. "ఛీ ఈమాత్రం అర్థం చేసుకోలేదా? నలుగురం వచ్చినప్పుడు – అతని భార్యకూడ వున్నప్పుడు, కొంచెం యింగితం వుండొద్దు?" విసుగుగా సిగరెట్టు వెల్గించి. నడిచాడు కృష్ణమూర్తి....

కార్లో కూర్చుని భార్యను బ్రతిమాలుతూనే వున్నాడు. కృష్ణమూర్తి వాళ్ళని చూసీ చూడనట్టు నడిచి వెళ్ళిపోయాడు. ఇలాంటి వింత వాతావరణంలో సాయంత్రం వచ్చింది. సాయంత్రపు బంగారు నీరెండ సముద్రంమీద అక్కడ ప్రకృతిమీద కదలని రాతిరథాలమీదపడి గమ్మత్తుగావుంది.... చూస్తుండగానే చీకట్లు ఆవరించుకున్నాయి. జనసంచారం సమసిపోయింది. సముద్రపు హోరు హెచ్చిపోయింది. ఆ కాశంలో నక్షత్రాలు గుంపులు గుంపులుగా వచ్చాయి. దారీ తెన్నూ లేకుండా నడిచాడు కృష్ణ

మూర్తి. అలా ఎంతసేపు తిరిగాడో! తనేమను కున్నాడు? ఏమైంది? ఇంత సంకుచితమా ఆడదాని మనస్సు! సమాధానం దొరకని ప్రశ్నలుతలెత్తి సముద్ర తరంగాలలాగే విరుచుకు పడిపోతున్నాయి....పార్వతేమైంది? అన్న ఆలోచనరాగానే తాము కూర్చున్న స్థలానికి మరలాడు కృష్ణమూర్తి. అక్కడెవరూ లేరు. గెస్టు హౌస్ వాచ్‌మన్‌ని అడిగాడు - కారు వెళ్ళిపోయిందన్నాడు: మరి పార్వతి?

ఆందోళననిండిపోయింది హృదయంలో. తిరిగి అలాగే....ఫీటీవారగా నడవడం ప్రారంభించాడు....షోర్ టెంపుల్ దగ్గర ఆగి పైకి వచ్చాడు. షోర్‌టెంపుల్ వెనుక వైపు సముద్రం. అక్కడవున్న రాళ్ళ మీద విరుచుకుపడుతున్నాయి కెరటాలు. అక్కడే ద్వారబంధంలా నిలబడ్డానికి వుంటుంది....అక్కడ నిలబడితే తుంపరలుమీద పడుతూవుంటాయి. ప్రశాంతంగా అక్కడ నిలబడదామని అటు నడిచాడు కృష్ణమూర్తి. కొంచెందూరం వెళ్ళి చూసే సరికి అక్కడ ఎవరో కూర్చుని వుండడం గుర్తించాడు. పార్వతి! తడిసిన పిల్లి కూనలా దగ్గరసా ముడుచుకుని కూర్చుంది. అక్కడ అలా పార్వతిని చూస్తూంటే జాలితో నిండిపోయింది కృష్ణమూర్తి హృదయం. పార్వతిమీద వచ్చినకోపం కాస్తా జారిపోయింది. "పార్వతీ! ఇక్కడ కూర్చున్నావు? నీకోసం నేనెంత ఆరాట పడుతున్నానో?" అంటూ పక్కనే వెళ్ళి కూర్చున్నాడు.


పార్వతి ఉన్నట్టుండి ఏడవడం మొదలు పెట్టింది. బుజంమీద చేయివేసి దగ్గరగా తీసుకున్నాడు. "ఏడవకు పార్వతీ. ఫరవా లేదులే - సరళ. మూర్తి దెబ్బలాట మరిచి హాయిగా వెళ్ళిపోయారు. నువ్వు నేను వుండిపోయాం."

ఏడుపు నెలాగో అరికట్టుకొని, "అది కాదు కృష్ణమూర్తీ. మీ సరళని చూసేదాకా నా తప్పేమిటో నాకుతెలియలేదు. మొదట్లో నేను అంతే చేశాను. ఒక్క ఎదురుమాట లేదు. అంతా ఏకీభవిస్తూ ఎస్ అంటూ గడిపేశాను. ఫలితంగానే అతనికి దూరంగా పోయాను. మాట్లాడుకోడానికేం మిగులుతుంది అలా అయితే! ఇప్పుడు మీసరళ అంతే చేస్తుంది. కొంచెం అసూయకల్గితే యిద్దరూ మళ్ళీ సవ్యంగా వుంటారేమో అని తోచింది. తుమ్మితే వూడిపోయే ముక్కులాగా అంతసాఫీగా వుంటే ఎలా వివాహ జీవితం. విసుగెత్తదూ?....నిన్ను చూస్తే నాకందుకే భయం. మళ్ళీ నిన్నూ విసిగించి దూరం చేసుకుంటా నేమో అని భయం. ఆ భయంతోటే నీతో మాట్లాడలేకపోయే దాన్ని...." గట్టు తెగిన ప్రవాహంలా మాట్లాడేస్తూంది పార్వతి. నవ్వుతూ ఆమెని మరింత దగ్గిరగా తీసుకుంటూ.... 'ఇప్పుడు మాట్లాడుతున్నావు పార్వతీ.' అన్నాడు.

"అవునా?" ఆశ్చర్యంగా అంది పార్వతి.

"అవును. మాట్లాడుతున్నావు" తన గుండెల కదుముకున్నాడామెని. గట్టిగా పెదవులు ముద్దెట్టుకున్నాడు. కెరటాలు విరిగి తుంపరలు మీదపడి గిలిగింతలు పెడుతున్నాయి. పార్వతికూడా ముడుచుకున్న చేతులు జాపి అతణ్ణి చుట్టవేసింది. కొద్ది క్షణాల నిశ్శబ్దంలో సముద్రపు హోరుగాలి జోరు ప్రతిధ్వనించాయి. "పార్వతీ నాతో మాట్లాడు, అంటున్నాడుకృష్ణమూర్తి" "నిన్ను ప్రేమించాను కృష్ణమూర్తి." అంది పార్వతి అతని బుజంలో తల దాచుకుంటూ. ఆ చీకట్లోకి చూస్తూ నవ్వుకున్నాడు కృష్ణమూర్తి. మెత్తని ఆమె జుట్టు నిమురుతున్నాడు. "నువ్వు మాట్లాడుతూంటే నాకు ఎంతో బాగుంది!" చేతులు కలిపి చీకట్లో సముద్రం చూస్తూ నిలబడ్డారు. చీకట్లో సముద్రం ఎంతబాగుంది! "ఇంటికి వెళ్ళి పోదాం. ఆఖరు బస్సుకూడా యిక వెళ్ళి పోతుంది" అంటూ బీచ్‌వెంట నడిపించాడు.

"రేపు మొదటిసారిగా నా ప్రేయసిగా నిన్ను సినిమాకి తీసుకు వెడతాను. ఇళ్లూ వాకిళ్ళని టిఫిన్ పుచ్చుకొనే మొసలిని గురించి కొత్త సినిమా వచ్చింది! నీకు నచ్చుతుందికదూ?" అన్నాడు కృష్ణమూర్తి




ఆమెనడుంమీద చెయ్యి బిగిస్తూ- "ఓ! చాలా దావుండేలావుంది కృష్ణమూర్తీ. తప్పకుండావెడదాము." అంది మునివేళ్ల మీద లేచి అతని చెంపమీద చిన్న ముద్దు పెడుతూ. గాలికి రేగి అడ్డుపడుతున్న ఆమె జుట్టు చేత్తో పట్టుకొని గట్టిగా కౌగలించి ముద్దు పెట్టుకున్నాడు కృష్ణమూర్తి.

మర్నాడు సినిమాలో వెనుకసీట్లో కూర్చుని చేతులు పట్టుకొని ఒకళ్ళ కళ్ళలోకి ఒకళ్ళు చూస్తున్నారే తప్పించి - న్యూయార్కుని సునాయాసంగా భోజనం చేస్తున్న మొసలిని వారు పట్టించుకోలేదు. అందుకే ప్రేమ గుడ్డిదన్నారు కాబోలు!!

□□□

---

తండ్రి కొడుక్కి తన ఫొటో ఆల్బమ్ చూపిస్తూ ఒకచోట "ఇది మీ అమ్మా, నేనూ పెళ్ళిరోజున తీయించుకున్న ఫొటో" అని చెప్పాడు.

"అంటే, అమ్మ మనింటో నౌకరీకి కుదిరిన రోజన్నమాట అంతేనా?" అని అడిగాడు కొడుకు,

---

కాఫీ ఒక గుక్క మింగి ఒక ఆసామీ సర్వర్‌ని పిలిచి కోపంగా అడిగాడు.

"ఈ ఆవదపు కాఫీ ఎలా తాగమంటావోయ్? పిలు, మీ మేనేజర్ని"

"లాభంలేదండి. ఆయనసలు తాగలేరు" అన్నాడు సర్వర్.